చెలిమె

తెలంగాణ ప్రజలకు భాష ఓ పిలుపు మాత్రమే కాదు. చరిత్ర మారినా చెదరని అస్తిత్వం. అందుకే తెలంగాణ ఘన సాహిత్యానికి పెద్దపీట వేస్తూ చెలిమెను నిర్వహిస్తున్నది మన పత్రిక. అలసిసొలసిన వేళల్లో కళారూపాలైనా, పోరుబాటల్లో పాటలా మారినా, ఆత్మగౌరవాన్ని కథతో నినదించినా... తనదైన శైలి తెలంగాణది. ఆ సాహిత్యంలో మీకు ఎలాంటి అభిరుచి ఉన్నా, కలాన్ని కదిలించండి. ఆసక్తిగా, సూటిగా తెలంగాణ సాహిత్యానికి సంబంధించిన రచనలు చేయండి... editpage@ntnews.com

ముచ్చటైన భాషకు ముక్కుసూటి కవి

తెలంగాణ ఆవిర్భావం అనంతరం తెలంగాణ భాష ప్రత్యేకతను దేశం అంతా కీర్తిస్తోంది. చెప్పవలసిన అంశాన్ని ముక్కుసూటిగా, ఒకింత పరుషంగా, కుండబద్దలు కొట్టినట్టు ప్రకటించే భాష తెలంగాణ భాష. గ్రామీణ పలుకుబడులతో, సామెతలతో, జాతీయాలతో పరిపుష్టమైన భాష తెలంగాణ భాష. ప్రాచీన కవుల నుంచి ఆధునికానంతర కవుల దాకా వెలువరించిన సాహిత్యంలో తెలంగాణ భాష కమ్మదనం, అమ్మదనం సాక్షాత్కరిస్తాయి. కాళోజీ కవిత్వమూ అంతే!



కృష్ణానది ప్రవహించే బీజాపూర్‌లో 1914లో పుట్టారు కాళోజీ. కృష్ణానదిలాగే కర్ణాటక నుంచి తెలంగాణకు ప్రవహించి పెరిగి పెద్దయ్యారు. ఈ మట్టివాసనను నరనరాన ఒంటబట్టించుకుని, కవిత్వంలో ఒలికించారు. చారిత్రక ప్రాధాన్యం కలిగిన బీజాపూర్ (కర్ణాటకలోని విజయపుర)లో జన్మించి, చారిత్రక విశిష్టత కలిగిన హనుమకొండ ప్రాంతంలో పెరిగి, విశిష్ట వ్యక్తిత్వాన్ని అణువణువూ సంతరించుకొని, తెలంగాణ చరిత్ర పుటల్లో ప్రధాన భాగమయ్యారు కాళోజీ. ఏకవచనంతో సంబోధించడం తెలంగాణ ప్రేమ భావనకు, అందరినీ హత్తుకుని దగ్గరకు తీసే నైజానికి నిదర్శనం. స్వపక్షం వాడినైనా, విపక్షం వాడినైనా ఏకవచనంతో సంబోధించడం తెలంగాణవాసులకు ఉన్న ప్రత్యేక స్వభావం.ఈ స్వభావం కాళోజీ కవిత్వంలో కనబడుతుంది.

ఆంధ్ర సారస్వత పరిషత్తు తొలి వార్షికోత్సవం సందర్భంగా వరంగల్ కోటలో ఆ సంస్థ సభ్యుడైన కాళోజీ వేయించిన పందిళ్లను రజాకార్లు కూల్చేశారు. వరంగల్ కోటలో నాటి కాంగ్రెస్ నాయకులు జాతీయ పతాకాన్ని ఎగురవేయడంతో రజాకార్లు మారణాయుధాలతో దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో మొగిలయ్య అనే కార్యకర్త మరణించాడు. రజాకార్లతో ముఖాముఖి ఘర్షణకు దిగారు కాళోజీ. ఫలితంగా మూడునెలలపాటు నగర బహిష్కరణ శిక్షకు గురయ్యారు. ఆ సందర్భంగా విచారణకు వెళ్లిన ప్రధానమంత్రి మీరా ఇస్మాయిల్‌ను ఉద్దేశించి

> 'ఎన్నాళ్ల నుండియో ఇదిగో ఇదిగోయనుచు/ ఇన్నాళ్లకైనను వెళ్ళి వచ్చితివా/ కోట గోడల మధ్య ఖూనీ జరిగిన చోట /గూండాల శక్తులు గోచరించినవా?'' అని నిలదీశారు. ఈ కవితలో మీరా ఇస్మాయిల్‌ను ఏకవచనంతో సంబోధించడం కనిపిస్తుంది. ఇది తెలంగాణ భాష నైజం.

ప్రధానమంత్రి ఇందిరాగాంధీని కూడా ఏకవచనంతోనే సంబోధించారు కాళోజీ. 'ఒప్పందాలను నమ్మి/ ఒప్పుకుందిచాలమ్మా/ఎవరి ప్రాంతమును వారిని/ ఏలనియ్యి ఇందిరమ్మ' అని ఏకవచనంలో డిమాండ్ చేశారు. దేశంలో అత్యవసర పరిస్థితిని విధించినప్పుడు 1975 జూన్‌లో రాష్ట్రపతిని సైతం ఏకవచనంతో సంబోధించారు. 'పౌర జీవితమ్ము కాలి/ కమురు కంపు కొడుతుంటే/ ఎమర్జెన్సీ అత్తరుతో/ ఏమాత్రం ఆపగలవు/రాష్ట్రపతి ఏమంటవు' అని నేరుగా రాష్ట్రపతినే ప్రశ్నించడం కనిపిస్తుంది.

దేశవ్యాప్తంగా విధించిన అత్యవసర పరిస్థితి సందర్భంలో 'జాతిని కాపాడుటకు' అనే కవితలో 'పట్టియ్యి కాళోజీని/ మెడ కొట్టియ్యి కాళోజీది / నా గొడవ సాగకుండా / చేసెయ్యి వెంగళ్రావ్' అని వెంకగరావుకు సవాలు విసిరారు. ముఖ్యమంత్రి చెన్నారెడ్డిని 1978లో'ఉద్రిక్తులను చేసి ప్రజల/నుగ్రవాదులంటావా / కాళోజీ అడుగుతాండు / ఏమంటవ్ మర్రి చెన్న?' అని ప్రశ్నించారు.

కాళోజీకి గాంధీజీ అంటే చాలా అభిమానం, ప్రేమ. ఆ ఇష్టంతో రాసిన కవితల్లోనూ గాంధీజీని ఏకవచనంతో సంబోధించడం కనిపిస్తుంది. 'ఇంకేమి కావాలె? ఇంకేమి చేయాలె / బతికినన్నాళ్లు నిన్ను బాపు అని పిలిచితిమి / చచ్చిపోయిన నిన్ను జాతిపిత జేసితిమి / పెక్కుభంగుల నిన్ను చెక్కి నిలవేసితిమి / వేడ్కతో ఇంటింట వ్రేలాడదీసితిమి/ నీ మాట మాటుననె మా మాట పలికితిమి / నీ అడుగులను చూపి మా అడుగులు వేసితిమి'' అని స్మృతి కవిత రాశారు కాళోజీ.

కాళోజీ రాసిన మరో స్మృతి కవిత లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్‌ను ఉద్దేశించింది. 'పుటకనీది /చావు నీది / బతుకంతా దేశానిది' అని జయప్రకాశ్‌నారాయణ్ జీవన సార్థకతను ఏకవచనంలో వ్యక్తపర్చారు కాళోజీ.

తన సహాధ్యాయి పీవీ నరసింహారావు ప్రధాన మంత్రి అయినా ఆయనను ఏకవచనంతో సంబోధించడం మానలేదు కాళోజీ. ప్రధానిగా ఆయన నివాసంలోని భద్రతా ఏర్పాట్లు చూసిన కాళోజీ 'ఏమిరో, తెలంగాణలో, వరంగల్‌లో ప్రజలు కటకట పడుతున్నారు. వాళ్ల తరపున పోరాడుతున్న వాళ్లు కటకటాల వెనుక ఉన్నారనుకున్నాను. ఇంత దూరం వచ్చి నీకిదే చెప్తామనుకున్నాను. కానీ నువ్వే పెద్ద బందిఖానాలో ఉన్నట్లున్నావు కదా'' అన్నారు. ఈ సంభాషణలో నాటి ప్రధానమంత్రిని సాన్నిహిత్యంతో 'ఏమిరో' అనడం కూడా కనిపిస్తుంది. ఇదీ తెలంగాణ దోస్తానా.

> 'ఆపతి' మరో తెలంగాణ పదం. ఆపద సమయాన్ని ఈ పదంతో సూచిస్తాం. తెలంగాణను ప్రగాఢంగా వాంఛిస్తూ రాసిన కవితలో కాళోజీ ఈ పదాన్ని ఉపయోగించారు.'తెలంగాణ వేరైతే / దేశానికి ఆపత్తా?'' అని సూటిగా ప్రశ్నించారు. తెలంగాణ వేరైనంత మాత్రాన దేశానికి వచ్చే ప్రమాదమేమీ లేదని, తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షను వ్యక్తం చేశారు.

> 'బాంచెన్ దొరా కాల్మొక్త' తెలంగాణలో రెండు దశాబ్దాల క్రితం వరకు తరచుగా వినిపించిన మాట. ఈ మాటను తన కవిత్వంలో ఉపయోగించారు కాళోజీ. ఈ మాట అనే ప్రజలే నిజాం తొత్తులైన దొరల పని పడతారని 'దొరల దెబ్బల తినుచు గురువు సాపెన వినుచు / 'బాంచెనయ్యా' యనుచు ప్రణమిల్లు ప్రాణాలు / ఇప్పుడిప్పుడె తెప్పరిల్లుతున్నాయి'' అని హెచ్చరించారు.

'గారబం చేయడం' తెలంగాణలో గారాబానికి మరో మాట. ఎంతో ప్రేమ, ఆప్యాయత, అనురాగం ఉన్న వ్యక్తుల మధ్య పల్లవించేది గారాబం. దీన్నే తెలంగాణలో గార్వం, గారవం అంటున్నాం. 1943లో వరంగల్లులో జరిగిన కవిసమ్మేళనానికి అధ్యక్షుడు రాయప్రోలు సుబ్బారావు. తెలంగాణ విద్యారంగానికి గుండె కాయలాంటి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖ అధిపతిగా ఉంటూ అప్పుడు తీవ్ర స్థాయిలో జరుగుతున్న నిజాం వ్యతిరేకోద్యమంలో రాయప్రోలు సుబ్బారావు పాల్గొనలేదన్న విమర్శలు వెల్లువెత్తిన రోజులవి. ఈ సందర్భంగా రాయప్రోలును అధిక్షేపిస్తూ ..

> 'చేరదీసి నిన్ను గారవము చేసినా/ మావి గున్నల మాట మాట వరసకునైనా / ఎన్నడైనను తలచితే కోకిలా / ఎప్పుడైనను పాడితే కోకిలా'' అని కవిత్వం చదివారు. ఎంతో గారాబంతో చేరదీసిన తెలంగాణ వారి సమస్యలనూ పట్టించుకొమ్మని రాయప్రోలు సుబ్బారావుకు విజ్ఞప్తి చేసిన కవిత ఇది.

తెలంగాణ వివిధ ప్రాంతాల వారిని తన గుండెలకు హత్తుకుంది. తనలో కలుపుకుంది. తెలంగాణ నేలకు ఉన్న ఈ స్వభావమే తెలంగాణ భాషలోనూ కనిపిస్తుంది. తెలంగాణ సుదీర్ఘకాలం నిజాం ఏలుబడిలో ఉన్నందువల్ల ఈ ప్రాంతంలో ఉర్దూ పదాలు తెలంగాణ భాషలోఅంతర్భాగమయ్యాయి. ఆ పదాలు కాళోజీ కవిత్వంలోనూ కనబడుతూ తెలంగాణ భాష పర భాషలను తనలో ఇముడ్చుకున్న తీరును వివరిస్తాయి. వరంగల్ కోట ఘర్షణ విషయంలో ప్రధాని మీరా ఇస్మాయిల్‌ను ఉద్దేశించి రాసిన కవితలో ''బాజార్లో బాలకుని బల్లెంబుతో బొడుచు బద్మాషునేమైన పసిగట్టినావా? / కాలానుగుణ్యమా కాళోజీ ప్రశ్నలకు కళ్లెర్రజేసి ఖామోష్ అంటావా' అని నిలదీయడంలోనూ 'బద్మాష్', 'ఖామోష్' మొదలైన పరభాషా పదాలు కనబడతాయి. తన కవితా స్వరూపాన్ని గురించి తానే రాసుకున్న కవితలో 'జీ'అనని 'కలేజా'తో / కాళోజీ అను నది / నఖరాలు లేనట్టిది / అక్షరాల జీవనది'అనే కవితలోనూ పరభాషా పదాల విస్తృత ప్రయోగాలను గమనించవచ్చు.

> తెలంగాణలో వాడుకలో ఉన్న వివిధ సామెతలను, లోకోక్తులను, జాతీయాలను కాళోజీ తన కవిత్వంలో ప్రయోగించారు. నిజాం నవాబు ఏర్పరచిన విధాన సభకు ప్రతినిధిగా తన సన్నిహితుడు బలదేవ్ పతంగే ఎన్నిక కావడంపై 'కూయనీయని చోట / కూతబలముంటేమి?' అని ప్రయోగించడం కనిపిస్తుంది.'చెమ్మగిల్లని కనులు బతుకు / కమ్మదనమును చాటలేవు / చెమ్మగిల్లని కనులు బతుకు / కమ్మదనమును చూడలేవు' అనడం ఆయన కవిత్వంలో కనిపిస్తుంది.

భాష విషయంలో కాళోజీకి కొన్ని ప్రత్యేక అభిప్రాయాలున్నాయి. తెలంగాణ భాష, యాసపై ఎంతో అభిమానం కాళోజీకి. రెండున్నర జిల్లాల భాషనే తెలుగు భాషగా పత్రికల్లో ప్రకటితమవడాన్ని తప్పు పట్టారు.'రెండున్నర జిల్లాలదే దండి బాస అయినప్పుడు / తక్కినోళ్ల నోళ్ల యాస, తొక్కినొక్కబడ్డప్పుడు'' అని నిరసించారు. 'వందలేండ్లు తెలంగాణ / మంది వేరుగున్నప్పుడు / తెలంగాణ తెనుగుతనము / దినుసుగుణము పోయిందా?'' అని ప్రశ్నించారు.

డా॥ రాయారావు సూర్యప్రకాశ్ రావు
94410 46839

జీవభాష తెలంగాణను తన కవిత్వంలో విరివిగా ప్రయోగించిన కాళోజీ 2002 నవంబరు 13న అస్తమించారు. తెలంగాణ భాష ఉన్నంతకాలం ఆయన కవిత్వం సజీవంగా ఉంటుంది. చిరస్థాయిగా నిలిచిపోయే రచనలు చేసిన ఏ సాహిత్యకారుడికైనా మరణం లేదు. కాళోజీ కూడా అంతే!

(నవంబర్ 13 కాళోజీ వర్ధంతి)

బాలోత్సవం

నిండుగ నవ్వెడి బాలలు
దండిగ తమ సొంతమైన తరుణమెఱుగుచున్
పండిత జవహరు నెహ్రూ
గుండెను పూచిన గులాబి గొప్పగ మురిసెన్.

మకిలి వస్త్రములైన చకితమెరుగనట్టి
పరమార్థరూప సౌభాగ్యమొగము
చెడుగుడులాడుచు చిట్టిబొజ్జకు బువ్వ
బెట్టగను మరచు దిట్టతనము
పలుకులందు తేనెలొలుకగ వాదించు
పారలౌకికతత్వ భవ్యమనము
అరమరికలు లేక సరదాగ తిరిగెడు
అనురాగ బంధాల ఆత్మగుణము

కోరుకున్న రీతి ఊరేగు భోగంబు
పూర్వజన్మ సుకృత పుణ్యఫలము
చీకుచింత లేని చిననాటి యోగంబు
మరపురాని మధుర చరిత యుగము.

కరుణ ప్రేమల యందును తరుగుబోని
ఆత్మవిశ్వాస బలమును అందజేసి
శాంతిమయ గుణ సౌశీల్య కాంతితోడ
రోగపీడితుల మదినారోగ్యపరచు.

కల్లాకపటం తెలియని
పిల్లలు ఇలువేల్పులేను ప్రియమున గనగన్
చల్లని వెన్నెల సొనలు
మల్లెల సొబగుల చిలికెడు మాహాత్మ్యసిరుల్.

- రాకుమార
95501 84758

జీవిత వెలుగులు

దీపావళి తెల్లారి దిన పత్రిక రాలేదు
ఉదయం ఊరికే కదలదు కదా
వాకిట్లోని అక్షరాలను చదువుతున్నా
తమిళ తంబీలు నవ్వుతున్నారు నన్ను చూసి

> వీధి నిండా
> పిల్లల కేరింతలు పరుచుకున్నాయి
> గాలి వచ్చి దాడి చేయక ముందే
> నాలుగు ఫొటోలు తీసి
> నిన్నటి ఉత్సాహాన్ని వాట్సాప్ చేయాలి

అమ్మ లేచి ఊడవక ముందే
కాలని బాంబులు కొన్ని
కుప్పలు పోసి మంట పెట్టి
పిల్ల దీపావళి జరుపుకునేటోళ్ళం
బాల్యం అంటే భేషజం లేని జ్ఞాపకాలే

> కాల్చిన చేతులు మసి బారితే
> దేశమంతా చిచ్చుబుడ్లు నింగిలో
> అక్కడి బాల్యం కరిగి కాలి
> ఇక్కడ వాకిలి విర బూసింది
> త్యాగాలు లేకుండా తళుక్కులు ఎక్కడివి

కాసిన్ని పటాసులు కాల్చుకుంటే
కార్మికుల కడుపులు నిండేదెలా
ఆకాశం కొంత కోపగించినా
డబ్బులు వృధా కాలేదు
ఒక్క అమావాస్య ఎన్నో జీవితాలకు వెలుగులు

దాసరి మోహన్
9985309080

అల్కువిడుస

పొద్దున్నే లేచిన మా అమ్మ పాత కుండల
పటికె బెల్లమేశి దాశిపెట్టినట్టు
నల్లటి కూరట్కెల
నాలుగు ఎర్రమన్ను పెల్లలేశి
లోటెడు లీల్లు వోశి
గంటసేపు ఇంటి ఇడుపున
గడుపుమంటూ నాన వెడ్తుండె

వొంట పనైనంక మల్ల ఆమెనే వొయ్యి
దూరంగొట్న పోరగాన్ని
దెగ్గర్కి దీస్కున్నట్టు
అటికె మీద ఐదేళ్శేశి గుంజుకోని
ఇల్లంతా ఆవు పంచితం చల్లినట్టు
మంగళార్తి మనుషులందర్కి జూపెట్టినట్టు
అందంగా అల్కువూత చేస్తుండె

అదంతా ఆరకముందే
దేవుని ఇగ్రాన్ని పూవుల్తో పూబిచ్చినట్టు
ఇల్లంతా ముగ్గుల్పెట్టి లెస మురుస్తుండె

ఇంటిడుపులు జూసి
ఇల్లాలిని చెప్పొచ్చంటే
ఇదేమిడ్డిబి అనుకున్న గాని
ఇల్లు గురించి మా అమ్మ జేసే
ఇగురం జూస్తే నిజమే అన్పిచ్చింది

సంటిపోరన్లెక్క ఇల్లంత దోగ్యాడి
ఇంట్లో అందం ఇర్గవూయించినా
అమ్మ అర్శేతికి గోరింట వెడ్తెనే
అసలైన ఆనందం నాకని
ఆరానికొక్కసారి అల్కువిడుస
ఆమె శెయ్యినందుకోనీకె
ఇగలేని ఆరాటపడ్తుండె

ఒచ్చిపాయ్యెటోల్లు ఒద్దిస్తె బాగుండదని
ఒయ్యారం ఒలుకవోసేటట్టు
ఇడుపుల మీద ఇంతశేపు
ఒడుపుగా నడుస్తుండె

అల్కువిడుసంటే అందినకాడికి
ఎర్రమన్ను నీల్లుదాగి
ఇంటి బయట మూలకు
ఇడుపులపోంటి కూసోని
ఇగలవట్టేది కాదు
ఇంటికీ ఇల్లాలికీ పేరుదెచ్చేది

అల్కువిడుసంటే
పనికిరాని బట్టపేగును
పనిలో పెట్టేంచనీకె
పాకులాడే రకం కాదు
ఇంతి పాదాలకు పసుపు లెక్క
గదువలకు గంధం లెక్క
ఇంటికి... అందాన్ని సలువను
అపురూపంగా అద్దేది

కమలేశ్
91603 96596

బాలసాహిత్యంతోనే ఉజ్వల భవిత

సాహిత్యం అంటే సమాజానికి హితం చేసేది. ఏ దేశంలోనైతే సాహిత్యం పరిఢవిల్లుతుందో ఆ దేశంలో సమాజం విజ్ఞాన దాయకంగా ఎదుగుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు.ముఖ్యంగా ఎక్కడైతే బాలసాహిత్యానికి పెద్దపీట వేయబడుతుందో భవిష్యత్తులో అక్కడ మంచి విలువలతో కూడిన సమాజం ఆవిర్భవించే అవకాశం ఉంటుంది. నేటి బాలల సాహిత్యమే రేపటి భవిష్యత్తు సాహిత్యం. ఒక మంచి విత్తనం నాటకుండా మంచి ఫలాలను ఆశించలేం. అందుకే పిల్లలను అన్ని విధాలా తీర్చిదిద్దటంలో అందమైన భవిష్యత్తును నిర్మించడంలో బాల సాహిత్యం కీలకమైన పాత్ర వహిస్తున్నది.



బాల సాహిత్యంచరిత్ర, తీరుతెన్నులు కనుక పరిశీలించినట్లయితే మనదేశంలో రెండువేల యేండ్లకు పూర్వమే పంచతంత్రం, భేతాళ కథలు వంటి పిల్లల కథలు ప్రాంతీయ భాషల్లో నీతి కథలుగా గుర్తింపు పొంది ఆ తర్వాత కాలంలో సంస్కృత భాషలోకి అనువాదం పొందినట్టు పరిశోధనలు చెప్తున్నాయి. 17వ శతాబ్దం వరకూ ఐరోపాలో జాన్ లాక్, రూసో భావజాలంతో పిల్లలను ప్రత్యేకంగా చూడటం వారి ఆనందం కోసం తగిన బాలసాహిత్యం సృష్టించడం జరిగింది. అయితే తెలంగాణ ప్రాంతంలో 12వ శతాబ్దానికి చెందిన ప్రసిద్ధ కవి పాల్కురికి సోమనాథుడు బసవ పురాణం లోని బాల్యం వర్ణనను వర్ణిస్తూ తొలిసారిగా బాలల కోసం జోల పాటలు అందించాడు. అదంతా బాల సాహిత్యంగానే పరిగణించవచ్చు. ప్రాచీన బాల సాహిత్యం అధికంగా మౌఖిక పరమైన గేయ రూపంలో ఉండేది. పాల్కురికి సోమనాథుని అనంతరం అనంతామాత్యుని భోజరాజీయం, కొఱవి గోపరాజు సింహాసన ద్వాత్రింశిక ప్రాచీన గ్రంథాలలో కూడా బాల సాహిత్యం ఛాయలు సందర్భానుసారంగా ప్రస్తావించబడినవి. శ్రీనాథ మహాకవి, నాచన సోముడు , బద్దెన సుమతి శతకం, యోగి వేమారెడ్డి వేమన శతకం, తదితర శతకాలలో కూడా బాల సాహిత్య ఛాయలు కనిపిస్తాయి.

> కాశీ మజిలీ కథలు, పంచతంత్రం కథలు, చందమామ, బాలమిత్ర, బుజ్జాయి, భేతాళ కథలు ఆధునిక బాలసాహిత్యంలో కేంద్రబిందువులయ్యాయి. అదేవిధంగా మహాభారతం, రామాయణం, బసవ పురాణం, కేయూరబాహు చరిత్ర, పోతన భాగవతం మొదలైన గ్రంథాలలో కూడా బాలసాహిత్యం వికాసం చెందినట్లు మనకు తెలుస్తుంది.

ఆధునిక కాలానికి వచ్చినట్లయితే ఆధునిక బాలసాహిత్యంలో డాక్టర్ సింగిరెడ్డి నారాయణరెడ్డి, దాశరథి, పాకాల యశోదా రెడ్డి, కపిలవాయి లింగమూర్తి, గడియారం రామకృష్ణ శర్మ, మొదలగు వారు ఎందరో బాలల కోసం పద్యాలను, నీతి కథలను, ప్రముఖుల జీవిత చరిత్రలు తదితర అంశాలతో ప్రారంభించి తదనంతరం గొప్ప సాహితీవేత్తలుగా ఎదిగారు. ఇంకా వేదాంతసూరి, మలయశ్రీ, వాసాల నరసయ్య, పైడిమర్రి రామకృష్ణ, భూపాల్, వి ఆర్ శర్మ, చొక్కాపు వెంకటరమణ, డాక్టర్ పత్తిపాకమోహన్, పెండెం జగదీశ్వర్, బి. వేదకుమార్, బోయ జంగ య్య, వురిమల్ల సునంద, గరిపల్లి అశోక్, దాసరి వెంకటరమణ, ఉండ్రాల రాజేశం,సమ్మెట ఉమాదేవి, కోమటి రెడ్డి బుచ్చిరెడ్డి, పుప్పాల కృష్ణమూర్తి, కందేపి రాణి ప్రసాద్ ఇలా మరెందరో బాల సాహిత్యంలో కృషి చేస్తున్నారు. బాల సాహిత్యం ఒకప్పుడు పిల్లల కోసం పెద్దలు మాత్రమే రాసేది. కానీ ఇటీవల కాలంలో పిల్లలు కూడా బాల సాహిత్య రచనలు చేయడం గమనార్హం. మన రాష్ట్రంలో బడిపిల్లల రచనలు పుస్తకాల రూపంలో రావడం ఇందుకు నిదర్శనం.

బాల సాహిత్య ప్రక్రియలు వివిధ రూపాల్లో ఉంటాయి. పిల్లల భాషలోనే సాహిత్యం ఉండాలి. బాల సాహిత్యం కాలక్షేపానికి కాకుండా భాష నేర్చుకునేదిగా ఉండాలి. బాలసాహిత్యం రాసేటప్పుడు విద్యార్థుల స్థాయిని దృష్టిలో పెట్టుకోవాలి. బాల సాహిత్యం కథలు గేయాలు, కవితలు, కథానికలు, నాటిక లు, ఏకపాత్రలు, చిత్రకథలు, పొడుపు కథలు, వ్యాసాలు, లేఖలు, సన్నివేశాలు, సంఘటనలు, ప్రశ్నోత్తరాలు, జీవిత చరిత్రలు, పద్యాలు, సామెతలు, బుర్రకథలు, చిట్టి వ్యాసాలు, అభినయ గేయాలు వంటి వివిధ ప్రక్రియల్లో ఉంటుంది. ఈ ప్రక్రియలన్నీ జానపదం, పౌరాణికం, వైజ్ఞానిక, దేశభక్తి, వినోదం, పర్యావరణం, భూతదయ, పండుగలు, సంస్కృతి సంప్రదాయాలు, మొదలైన అంశాలతో ఆలోచనలు రేకెత్తించే విధంగా సృజనాత్మకత ఉట్టిపడే విధంగా ఇతివృత్తాలు ఉండాలి.

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన పిమ్మట బాల సాహిత్యానికి ప్రభుత్వం పెద్ద పీట వేసింది. అందుకు ఉదాహరణ ప్రపంచ తెలంగాణ తెలుగు మహాసభలలో రెండు రోజులపాటు బాల సాహిత్య సదస్సు, బాల కవి సమ్మేళనం నిర్వహించడం. అంతేకాకుండా తెలంగాణ సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో మన ఊరు మన చెట్టు కార్యక్రమంలో భాగంగా ఒకే రోజున వందలాది పాఠశాలల్లో వేలాది విద్యార్థులచే కథలు రాయించడం గొప్ప పరిణామం. ప్రతి పాఠశాలలో రీడింగ్ పీరియడ్ ఏర్పాటుచేసి గ్రంథాలయ పుస్తకాలు చదివించడం, వారం వారం బాల సభలు నిర్వహించడం, బాల సాహితీవేత్తలచే వర్క్‌షాపులు ఏర్పాటు చేయడం ద్వారా బాల సాహిత్యం పై విద్యార్థులకు కొంతవరకు అవగాహన పెరిగింది. దాని ఫలితమే పిల్లలే సాహిత్యాన్ని సృష్టించుకుంటున్నారు. గొప్ప ఆలోచనలకు అక్షరరూపం ఇస్తున్నారు.

పిల్లలు నేడు నేర్చుకునే దశనుండి తమను తాము మార్చుకునే దిశవైపు పయనిస్తున్నారు. కవితలు,కథలే కాదు, శతకాలు కూడా రాస్తున్నారు. ఇప్పటి వరకు వివిధ పాఠశాలల నుండి దాదాపు 150 బాలల పుస్తకాలు పురుడు పోసుకున్నాయి. ఇది నిజంగా గొప్ప పరిణామం. దీనికి ప్రభుత్వ పాఠశాలలు వేదిక కావ డం గొప్ప మార్పు. ఈ విధంగా బాల సాహిత్యం మూడు పువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లుతోంది. బాలసాహిత్యం రంగుల ప్రపంచంగా మారుతుంది. అంతేకాకుండా మన తెలంగాణ ప్రభుత్వం బాల సాహితీవేత్తలను కూడా మరింతగా ప్రోత్సహించాలి. ఇదంతా జరిగి తీరుతుందని ఆశిద్దాం.

కోమటి రెడ్డి బుచ్చిరెడ్డి
94415 61655

(నవంబర్ 14 బాలల దినోత్సవం)

కలం పిలుపు

స్మారక పురస్కారాలు

నిజాం వెంకటేశం స్మారకార్థం వివిధ రంగాల్లో ఇచ్చే సాహిత్య పురస్కారాలకు డా.వి. త్రివేణి, డా.ఎం.దేవేంద్ర, గోపగాని రవీందర్, గజ్జెల రామకృష్ణ, శిర్పి చంద్రశేఖర్‌లను ఎంపిక చేశారు. నవంబర్ 14న సికింద్రాబాద్‌లో పురస్కారాలు అందజేస్తారు. ఈ కార్యక్రమంలో వింజమూరి సూర్యప్రకాశ్, ఆడెపులక్ష్మీపతి, గంగారెడ్డి, నిజాం మాధవిలతో పాటు నిజాం మిత్రబృందం పాల్గొంటుంది.

-నిజాం మిత్రబృందం

జ్ఞానజ్యోతి పురస్కారం

జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా తెలుగు సాహిత్యంలో విశేష కృషి చేస్తున్న రచయితకు 'ఆరసం' ఏటా ఇచ్చే 'జ్ఞానజ్యోతి' పురస్కారానికి ప్రముఖ రచయిత్రి డా. చిల్లర భవానీదేవి ఎంపికయ్యారు. తెలుగు సృజనాత్మక రచనలతోపాటు అనువాద ప్రక్రియలోనూ బహుముఖ ప్రజ్ఞ కలిగిన భవానీదేవి కృషిని గుర్తించి ఈ పురస్కారానికి ఎంపిక చేసింది.

- చలపాక ప్రకాష్

జనజీవన తత్వమే పాట

పల్లెలు దేశానికి పట్టుకొమ్మలు. పల్లెలు పచ్చగా ఉంటేనే మనం సమృద్ధిగా, సంతోషంగా ఉంటాం. పల్లెకు పాటకు అవినాభావ సంబంధం ఉన్నది. పల్లె ప్రజల కాయకష్టం లోంచి పాట పుట్టింది. కాయకష్టాన్ని మరచిపోవడానికి పల్లె జనం పాడుకునే పదాలే పల్లెపదాలు. వీటినే జనపదాలు, జానపదాలు అంటారు.

జానపదాలకు మన సాహిత్యంలో ప్రముఖ స్థానం ఉన్నది. జానపదాలలో పల్లె శ్వాస ఉంటుంది. పల్లె జనుల ఘోష ఉంటుంది. పల్లెదనపు ఇష్టం ఉంటుంది. వాళ్ల కష్టం ఉంటుంది. వారు చేసేపనీ, చేసే పద్ధతీ ఉంటుంది. పల్లె పరిమళం ఉంటుంది. పనిలోన దాగున్న శ్రమైక జీవుల జీవనం ఉంటుంది. వారి జీవితం ఉంటుంది. శ్రీశ్రీ చెప్పిన శ్రమైక జీవన సౌందర్యం ఉంటుంది.

సాహిత్యం లోని ఇతర ప్రక్రియలు, జన బాహుళ్యానికి అందవు. కానీ పాట చిన్న పెద్ద, పండితుడు, పామరుడు అనే తారతమ్యం లేకుండా, అందరినీ ఆకట్టుకుంటుంది. రంజింపచేస్తుంది. 'రసరా జు' లను చేస్తుంది. పాట కునుకు రాని కండ్లకు జోలపాట అవుతుంది. పగిలిన మనసుని ఓదారుస్తుంది. ఓదార్పు అవుతుంది. విరిగిన మనసుకు వేదాంత పాఠ మవుతుంది. తత్వమవుతుంది. ప్రాణ స్నేహితుడవుతుంది. పాట మనల్ని ఉత్సాహ పరుస్తుంది. ఉత్తేజ మవుతుంది. ఉత్తేజితులను చేస్తుంది. 'మనసు మాటకందని నాడు మధురమైన పాటవుతుంది' అని పాట స్వభావాన్ని లక్షణాన్ని చెప్తారు వేటూరి సుందర రామ్మూర్తి. పాట జీవితాలను పండుగ చేస్తుంది. పాట పరిమళాలను వెదజల్లుతుంది. పాట ప్రణయం కాగలదు. ప్రళయమూ తేగలదు. పాట గుండెల్ని పండిస్తుంది. గుండెలను పిండుతుంది కూడా. జీవతత్వమే పాట. జీవన తత్వమే పాట. జీవితతత్వమే పాట. జనజీవన జీవిత తత్వాల సమ్మిళితమే పాట.

పాట పాట కోసమే కాకూడదు. పాటకు ఓ ప్రయోజనం ఉండా లి. అవసరమైతే పాట సమాజాన్ని సంస్కరింపజేసే ఓ సాధనం కావాలి.సాధనం కాగలగాలి. ప్రయోజనం కోసం తపన పడే పాట ప్రజలతో మమేక మవుతుంది. దేశ రాజకీయ సామాజిక ఆర్థిక రంగాల స్థితిగతులను వర్తమాన పరిస్థితులను, పరిమితులను ఆకళింపు చేసుకున్నదై ఉంటుంది. సమకాలీన పరిస్థితులను స్పృశి స్తూ, సమస్యలను ఎత్తి చూపుతుంది. సమాధానం చూపెడుతుంది. పాట చుట్టూ ఉన్న నోరులేని అమాయక పీడితుల గొంతు అవుతుంది. సమాజానికి తోడుగ నీడగ మారి, సమ సమాజా న్ని కాంక్షిస్తుంది. అపుడు పాట మనకు చుక్కాని అవుతుంది. మరో ప్రపంచపు పొలిమేరలకు మనల్ని తీసుకెళ్తుం ది. ప్రపంచ సరిహద్దులను చెరిపేస్తుంది. అవసరమైతే అక్షరాలు ఆయుధాలు అవుతాయి. పిడిబాకులై తాడిత పీడిత జనాల బాసట నిలుస్తాయి. పిడికిలి ఎత్తి ప్రశ్నించేలా చేస్తాయి. ప్రకంపనలు సృష్టిస్తాయి. పోరాటాలకు మనల్ని సిద్ధం చేస్తాయి. సంసిద్ధులను చేస్తాయి. పోరాటం చేసేలా చేస్తాయి.

> పాట మనలో పోరాట పటిమను పెంచుతుంది. పోరాటం ఉధృతమయ్యేలా చేస్తుంది. దేశ స్వాతంత్ర్య సంగ్రామం లోను, తెలంగాణ ఉద్యమంలోను పాట కీలకమైన పాత్రను పోషించింది అని చెప్పడం అతిశయోక్తి కాదేమో.

రమాప్రసాద్ ఆదిభట్ల
93480